VC NEWS

# వేగుచుక్క


పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

బుధవారం 03 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.238



2 లో

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సీరియస్

కోర్టుకు వెళతానని హెచ్చరించిన కెటిఆర్

## తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న ఎండలు



2 లో

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

పలు ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ

# ఎన్నికల వేడి.. కరువు దాడి

లోక్‌సభ సమరానికి ముందు రైతాంగ సమస్యలే ఎజెండా

ముదురుతున్న రాజకీయ యుద్ధం

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటున్న ప్రధాన ప్రతిపక్షం

వినతిపత్రాలు, దీక్షలతో వేడి రాజేస్తున్న వైనం

మేం చలికాలంలో అధికారంలోకి వచ్చామా అంటూ అధికార పక్షం వివరణ

మీ కాలంలోనే కరువు వచ్చిందంటూ ఎదురుదాడి

మేము సైతం అంటూ బీజేపీ కార్యక్రమాలు

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు రైతాంగ సమస్యలే ఎజెండాగా మారాయి. కరువు పేరిట రాజకీయ యుద్ధానికి తెరలేపుతున్నాయి. రైతు సంబంధిత అంశాలను అస్త్రాలుగా మార్చుకుంటున్నాయి. విపక్షాలు, అధికార పక్షం ఒకదానిపై మరొకటి మాటల దాడులు చేసుకుంటున్నాయి. రైతు సంక్షేమానికి పాటు పడేది తామేనంటూ ఏకరువు పెడుతున్నాయి. ఎండిన పంటల పరిశీలన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో చేసిన పర్యటనతో కరువు రాజకీయం ముదురు పాకాన పడింది.

**కాంగ్రెస్ తెచ్చిన కరువన్న కేసీఆర్**

జిల్లాల పర్యటనలో కేసీఆర్ కాంగ్రెస్ పాలనపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే పంటలు ఎండిపోతున్నాయని, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువని ధ్వజమెత్తారు. అంతేకాకుండా రైతుల పక్షాన కార్యాచరణలో భాగంగా మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని చేపట్టింది. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆ పార్టీ నేతలు వినతిపత్రాలు అందజేశారు. మరోవైపు ఈనెల 5వ తేదీన కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పర్యటనలకు సైతం కేసీఆర్ సిద్ధమవుతుండగా, 6వ తేదీన వరి పంటకు బోనస్ డిమాండ్ చేస్తూ దీక్షలు చేపట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. మరోవైపు రిజర్వాయర్ల నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

**భరోసా పేరిట బీజేపీ**

బీజేపీ కూడా రైతుల పక్షాన ఆందోళన లకు దిగింది. రాష్ట్ర రైతాంగానికి భరోసా ఇవ్వడం కోసమంటూ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ మంగళవారం కరీంనగర్ వేదికగా రైతుదీక్ష చేపట్టారు. ఇదే క్రమంలో ఈనెల ఐదో తేదీన రైతు సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షకు కమలనాథులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎదురుదాడికి దిగుతూ విపక్షాలపై విమర్శలు ఎక్కుపెడుతోంది.




## కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన రైతులు



**కరీంనగర్:** కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేసిన రైతులను నట్టేట ముంచారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. కరీంనగర్ లో ఆయన రైతు దీక్ష చేపట్టారు. వంద రోజుల్లో రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇస్తానన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయలేదని, పంట నష్టపోయిన రైతులకు పరిహారంలో జాప్యమెందుకని నిలదీశారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగట్టడంతో రైతులకు భరోసా ఇచ్చేందుకే 'రైతు దీక్ష' చేపట్టినట్లు చెప్పారు. కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో రైతులతో కలిసి బండి సంజయ్ 'రైతు దీక్ష' కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి ఓటేసిన రైతులు మోసపోయారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని చేతులెత్తేసిందన్నారు.కోట్లాది రూపాయల ప్రకటనలతో 6 గ్యారంటీలను అమలు చేసినట్లుగా ప్రచారం చేస్తున్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు?. రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయడం లేదు?. వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని బండి సంజయ్ ప్రశ్నించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనయ్ వెంటనే బోనస్ ప్రకటించాలన్నారు. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని ఎందుకు తీసుకురాలేదు?. అకాల వర్షాలతో పంట నష్టపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికందిన పంట నీళ్లపాలైందన్నారు. అకాల వర్షాలకు రాలిపోయిన మామిడి పిందెలను, రాలిన వడ్ల కంకులను మీడియాకు చూపిస్తూ. సాగునీరు లేక పంట ఎండిపోయి రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# కెసిఆర్‌కు కరువు ఎప్పుడు వస్తుందో తెలియదా?



2 లో

చనిపోయిన రైతుల వివరాలు తెలియచేస్తే పరిహారం చెల్లిస్తాం

వేలాది పుస్తకాలు చదివినా తెలియకపోవడం ఆశ్చర్యమే

పదేళ్ల తరవాత కెసిఆర్‌కు రైతులు గుర్తుకు వచ్చారా

పదేళ్ల కెసిఆర్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగింది

ఫ్రస్టేషన్‌లో ఏమి మాట్లాడుతున్నాడో తెలియడం లేదు

తుక్కుగూడ సభలో జాతీయ మేనిఫెస్టో విడుదల

ఏర్పాట్లను పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి

ఎన్నికల తర్వాత మిగతా హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల తర్వాత అయినా మాజీ సీఎం కేసీఆర్ 'పొలం బాట' పట్టడం సంతోషమని చెప్పారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినందుకు, కవిత జైలుకు పోయినందుకు కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుందని అన్నారు. ఆయనకు ఏ సీజన్ ఎప్పుడు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు.

## రైతులకు 45 రోజులుగా పాలబిల్లుల పెండింగ్



**వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్**

**హైదరాబాద్,:** రాష్ట్ర వ్యాప్తంగా పాడిరైతులకు పాల బకాయలు ఉనాయని, వాటిని వెంటనే చెల్లించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. 2 లక్షల మందికి పైగా పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి, ప్రభుత్వం నడిపే విజయ డెయిరీకి ప్రతీ రోజు పాలు సరఫరా చేస్తున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు చెల్లించేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి బిల్లుల చెల్లింపు సకాలంలో జరగడం లేదని మండిపడ్డారు. 45 రోజుల పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 45 రోజులకు గానూ దాదాపు 80 కోట్ల రూపాయలు ప్రభుత్వం పాడి రైతులకు చెల్లించాల్సి ఉంది. బ్యాంకులలో, మహిళా సంఘాలలో, వడ్డీ వ్యాపారుల దగ్గర ఇలా వివిధ మార్గాల ద్వారా అప్పు చేసి పాడి రైతులు పశువులు కొనుగోలు చేశారు. అప్పుల కిస్తీలు క్రమం తప్పకుండా కట్టుకోవాల్సి ఉంది. పశువులకు దాణా, మినరల్ మిక్చర్, కాల్షియం, మందులు ఇతరత్రా సామగ్రి కూడా రోజూ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతోనే తమ ఫోన్‌లను ట్యాపింగ్ చేశారంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనం రేపుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వార్తలపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అవసరమైతే కోర్టుకు వెళ్తానంటూ హెచ్చరించారు. నాపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేసిన ఇద్దరు కాంగ్రెస్ నేతలు, మంత్రి కొండా సురేఖ పై కోర్టుకు వెళ్తానని అన్నారు. న్యాయపరంగా నాపై చేస్తున్న అబద్ధపు ఆరోపణలు ఎదుర్కొంటానని తెలిపారు. నిరాధారమైన, మతిలేని
ఆరోపణలు చేసిన ఇద్దరు కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖ, కేకే మహేందర్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లీగల్ నోటీసులు.. పరువు నష్టం దావాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాస్తవాలను సరి చూసుకోకుండా... ఇలాంటి వార్తలను ప్రచురించే మీడియా సంస్థలకు కూడా లీగల్ నోటీసులు పంపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపుతుందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో తవ్వే కొద్దే అనేక సంచనల విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మరో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు భుజంగరావు, తిరుపతన్నను అరెస్ట్ అయ్యారు. అలాగే ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌పై కేసు నమోదైన వెంటనే ఆయన అమెరికా వెళ్లిపోయారు. ప్రభాకర్ ఆదేశాల మేరకే హార్డ్ డిస్కులను ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం వాటిని రికవరీ చేసిన పోలీసులు.. డిస్కుల నుంచి సమాచారాన్ని రిట్రీవ్ చేసే పనిలో పడ్డారు. మరోవైపు ప్రణీత్ రావుతో పాటు మాజీ అధికారి రాధాకిషన్ రావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ కోసం పోలీసులు డబ్బును తరలించడం.. ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన నగదును సీజ్ చేయడం వరకు ప్రభాకర్‌రావు 'స్పెషల్ ఆపరేషన్ టీమ్' విధులను రాధాకిషన్ వివరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్(ఓఎస్‌డీ)గా నియమించడం గత ప్రభుత్వ పెద్దల వ్యూహాత్మక చర్య అని రాధాకిషన్‌రావు పేర్కొన్నట్లు దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో కేటీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో తీవ్ర కలవరాన్ని రేపుతున్నాయి. అవి నిరాధారమైన ఆరోణలని కేటీఆర్ చెప్పినప్పటికీ ఈ వ్యవహారనికి సంబంధించి పార్టీ అధినేత కేసీఆర్ నుంచి ఎలా స్పందిస్తారన్నది చూడాలి.

## తెలుగు రాష్ట్రాల్లో భయపెడుతున్న ఎండలు

**హైదరాబాద్:** వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటిపోగా, వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడు తున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో .. పలు ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ.. ఇళ్ల నుంచి బయటికి రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే ముమ్మందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళ్లుమనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయంటే సూర్యుడి విశ్వరూపం ఏ రేంజ్‌లో ఉందో అర్థంచేసుకోవచ్చు. ఒకవైపు ఎండలు దంచికొడుతుంటే, ఇంకోవైపు వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ తెలంగాణలో 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 37 మండలాలకు వార్నింగ్ ఇచ్చింది. అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని ఐఎండీ చెబుతోంది. ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది ఇప్పుడున్న ఉష్ణోగ్రతలు శాఖిపిల్స్ మాత్రమేనని, ముందుముందు ఇంకా పెరుగుతాయంటోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరిస్తోంది వాతావరణశాఖ. అందుకే అత్యవసరమైతే తప్ప, మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావొద్దని చెబుతోంది. తెలుగు రాష్టాల్లో్ర భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. సాధారణం కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏపీలో మంగళవారం 37 మండలాల్లో వడగాల్పుల ముప్పు అధికంగా ఉంటుందని వెల్లడించారు. అటు, తెలంగాణలోని 15 జిల్లాల్లో వడగాల్పుల ముప్పు ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు అధికారులు అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరం అయితే తప్ప పగటిపూట బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. తెలంగాణలో సగటున 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. రాబోయే 5 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

## లోక్‌సభలో బిఆర్‌ఎస్‌తోనే మా పోటీ

**వరంగల్:** లోక్‌సభ ఎన్నికల్లో తమకు బీఆర్ఎస్‌తోనే పోటీ అని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పోటీలోనే లేదని, బీఆర్ఎస్ ఆరోపణలను పట్టించుకోమని వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ.. తనకు ఎంపీ టికెట్ రావడంపై కాంగ్రెస్‌లో ఎలాంటి అసంతృప్తి లేదని.. ఎన్నికల్లో అందరినీ కలుపుకుని వెళ్తామని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యం, విద్యపై దృష్టి పెడతామని, వరంగల్ సమస్యలపై పోరాడతామని కావ్య అన్నారు.
కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యను వరంగల్ అభ్యర్థిగా నిర్ణయించింది. సోమవారం జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఆమె పేరును ఖరారు చేశారు. మొత్తం నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా.. కేవలం వరంగల్‌కు మాత్రమే ఖరారు చేసి మరో 3 స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. కడియం కావ్య తొలుత వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపిక కాగా, ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు ఆ పార్టీకి ప్రతికూలంగా మారడంతో పోటీ నుంచి విరమించుకుని తండ్రితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. కాగా.. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఖమ్మం నుంచి రెడ్డి వర్గానికి చెందిన నేతను ఎంపిక చేస్తే.. కరీంనగర్ నుంచి బీసీ వర్గానికి చెందిన నేతను బరిలోకి దించే అవకాశాలున్నాయి. అయితే కరీంనగర్ నుంచి ఇప్పటివరకూ చర్చకు వచ్చిన బీసీ, రెడ్డి, వెలమ సామాజికవర్గాల నేతల పేర్లను సీఈసీ భేటీలో నేతలు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఆ స్థానానికి బీసీ అభ్యర్థిని ఎంపిక చేసి గెలిపించే బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పజెప్పాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కరీంనగర్‌కు బీసీ అభ్యర్థి ఖరారైతే.. ఖమ్మం నుంచి రెడ్డి సామాజికవర్గం నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం ఖాయమని తెలుస్తోంది.

# నా అనుకున్న వాళ్లను నాశనం చేశాడు



**న్యూఢిల్లీ:** నా అనుకున్న వాళ్లందరినీ సీఎం జగన్ నాశనం చేశాడని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తాజాగా సీఎం జగన్ మోహన్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్యా రాజకీయాలను ప్రోత్సాహించాడని కుండబద్దలు కొట్టారు. ఏపీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు గాను కాంగ్రెస్ అధిష్ఠానం తొలి అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన కొద్దిసేపటి తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాను కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నిలబడుతున్నానని, ఈ నిర్ణయం తనకు సులువైంది కాదని అన్నారు. ఈ నిర్ణయం తన కుటుంబాన్ని చీలుస్తుందని, వైఎస్సార్ అభిమానుల్ని గందరగోళంలో పడేలా చేస్తుందని, అయినా తప్పనిసరి పరిస్థితుల్లో కడప ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దిగాల్సి వస్తోందని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి తన అన్న అని, ఆయనంటే తనకు ద్వేషం లేదని, గత ఎన్నికల సమయంలో తనని చెల్లే కాదు బిడ్డ అని పిలిచాడని వైఎస్ షర్మిల గుర్తు చేశారు. కానీ.. సీఎం అయ్యాక జగన్ మారిపోయాడని, ఇప్పుడున్న జగన్ తనకు పరిచయడం లేదని బాంబ్ పేల్చారు. వివేకాను హత్య చేసిన వారికే కడపలో ఎంపీ అభ్యర్థిగా సీట్
ఇచ్చాడని, ఇది తెలిసి తాను తట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య చేసిన వాళ్లకు శిక్ష విధించలేదని.. చేసిన వాళ్ళ, చేయించిన వాళ్లు తప్పించుకొని తిరుగుతున్నారని ఉద్ఘాటించారు. అన్ని సాక్ష్యాలు ఉన్నప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అధికారం వాడుకొని, జగనే వాళ్లని రక్షిస్తున్నాడని ఆరోపణలు గుప్పించారు. అవినాష్ రెడ్డిని వెనకేసుకు వస్తున్నాడని, మళ్లీ అతనికే సీట్ ఇచ్చాడని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రక్తంలో మునిగిపోయిందని, వివేకా హత్యను రాజకీయం కోసం వాడుకున్నారని, ఈ విషయం తమకు చాలా ఆలస్యంగా అర్థం అయ్యిందని పేర్కొన్నారు. చిన్నాన్న వివేకానందరెడ్డిని హత్య చేసిన వాళ్లకే జగన్ .. కడప ఎంపీ టికెట్ ఇచ్చారని షర్మిల ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసే లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించిన అనంతరం ఇడుపులపాయలో ఆమె మీడియాతో మాట్లాడారు. మా చిన్నాన్న వివేకానందరెడ్డిని హత్య చేసిన వాళ్లను, చేయించిన వాళ్లను జగన్ వెనకేసుకొస్తున్నారు. హంతకులు తప్పించుకొని తిరుగుతున్నా శిక్ష పడకుండా జగన్ వారిని కాపాడుతున్నారు. చిన్నాన్నను హత్య చేయించిన అవినాష్ రెడ్డికి జగన్ వైకాపా టికెట్ ఇవ్వడం తట్టుకోలేక పోయానన్నారు. వైఎస్సార్, వివేకా రామ-లక్ష్మణుడి లా ఉండేవాళ్లని.. తనని ఎంపీగా చూడాలన్నదే వివేకా ఆఖరి కోరిక అని షర్మిల పేర్కొన్నారు. తనని ఎంపీగా ఉండమని ఎందుకు అడిగారో ఆనాడు అర్థం కాలేదని, ఇవాళ అర్థం అయ్యిందని చెప్పారు. న్యాయం కోసం సునీత గడప గడపకు తిరుగుతున్నారని, న్యాయం కోసం ఆమె ఎక్కని మెట్టు లేదని అన్నారు. తాను హత్యా రాజకీయాలకు పూర్తి విరుద్ధమని పునరుద్ఘాటించారు. ఒక హంతకుడు పార్లమెంట్ మెట్టు ఎక్కకూడదనే తాను కడప ఎంపీగా బరిలోకి దిగుతున్నానని వివరణ ఇచ్చారు. ఒక్క అవకాశం అని చెప్పి రాష్టాన్ని్ర ముంచారని.. రాజన్న రాజ్యమని చెప్పి రాక్షస రాజ్యం తెచ్చాడని తూర్పారపట్టారు. ఒక్క ఛాన్స్ ఇస్తే.. రాష్టాన్ని్ర అప్పుల కుప్ప చేశాడని కడిగిపారేశారు. మద్యం ఏరులై పాలించాడని నిప్పులు చెరిగారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి, వారి ఆశీస్సులు తీసుకున్నామన్నారు. వైఎస్సార్.. కాంగ్రెస్ పార్టీ నాయకుడని, కాంగ్రెస్ తరఫున 10 ఎన్నికల్లో గెలిచారని, పదవులు లేకున్నా పార్టీలో నిలబడ్డాడని అన్నారు. ఏపీలో కాంగ్రెస్‌ను వైఎస్సార్ అధికారంలోకి తెచ్చారని.. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ఏర్పాటుకు తనవంతు సహకారం ఇచ్చారని షర్మిల తెలిపారు. వైఎస్సార్ బ్రతికి ఉంటే రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వారని, వైఎస్సార్ కల నెరవేరేదని అభిప్రాయపడ్డారు. తన తండ్రి ఆశయం కోసం తాను ఇవాళ పార్టీలో చేరానని, కాంగ్రెస్ గెలుపు కోసం పని చేయడానికి అందరం సిద్ధంగా ఉన్నామన్నారు. మంగళవారం 5 మంది ఎంపీలు,114 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల జాబితాను విడుదల చేశామని.. మరో రెండు, మూడు రోజుల్లో తుది జాబితా విడుదల అవుతుందని చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి జగన్ ఏనాడూ పని చేయలేదని, ఒక్క ఉద్యమం కూడా చేయలేదని అన్నారు. ప్రత్యేక హోదా వచ్చి ఉంటే రాష్ట్రం ఎప్పుడో బాగుపడేదన్న ఆమె.. రాష్ట్రం ఇవ్వాళ దీన స్థితిలో ఉందన్నారు. విభజన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, విభజన హామీలు నెరవేరాలన్నా.. కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు.

## 400 సీట్లు లక్ష్యంగా బిజెపి పావులు

**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు బిజీగా ఉన్నాయి. అధికారం కోసం ఎన్డీయే, ఇండియా కూటమి పోటీపడుతున్నాయి. వరుసగా మూడోసారి విజయం సాధించి.. హ్యాట్రిక్ కొట్టే లక్ష్యంతో బీజేపీ దూసుకెళ్తోంది. అడ్డుగా ఉన్న విపక్ష పార్టీలను బొక్కలో తోసే ప్రయత్నాలు మరోవైపు చురుకుగా సాగుతున్నాయి. కేజ్రీవాల్‌ను ఇప్పటికే లోపలేశారు. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఊచలు లెక్కించేలా చేశారు. కాంగ్రెస్ మెడలు వంచి ఐటి కేసులతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవకుంటే మరో ఐదేళ్లు ఆగాల్సి ఉంటుంది. విక్ష పార్టీలతో కలసి ఇండియా కూటమి ఏర్పాటు చేసినందున గెలుపు లక్ష్యంగా పోరాడుతోంది. అయితే నిధుల సమస్య కూడా తీవ్రంగా వెన్నాడుతోంది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంతో పాటు.. 400 సీట్లను గెలుచుకోవాలనే లక్ష్యంతో బిజెపి వ్యూహాలను సిద్ధం చేస్తోంది. మరోవైపు ఓట్ల శాతాన్ని 50 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. 400 సీట్లు వచ్చినా బీజేపీ 50 శాతం ఓట్లను సాధించగలదా అనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. 400 సీట్లు ఒక పార్టీ సాధించడం ప్రస్తుత పరిస్థితుల్లో అసాధ్యం గతంలో కాంగ్రెస్‌కు పోటీగా ఇతర పార్టీలు అంతగా ప్రభావం
చూపించకపోవడంతో ఆ పార్టీ ఎక్కువ సీట్లతో అధికారాన్ని చేపట్టగలిగింది. అయితే దేశంలో 400కు పైగా సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ ఎప్పుడూ 50 శాతం ఓట్లు సాధించలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ తన లక్ష్యాన్ని ఎలా చేరుకోగలదా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. స్వతంత్ర భారత దేశంలో ఇప్పటివరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరగాయి. 10 సార్లు మాత్రమే పూర్తి మెజారిటీతో ఒకే పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. కాంగ్రెస్ ఏడుసార్లు, బీజేపీ రెండుసార్లు, జనతా పార్టీ ఒకసారి పూర్తిస్థాయి మెజార్టీ సీట్లు గెలుపొందాయి. 7 సార్లు లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాలేదు. దేశంలో ఇప్పటి వరకు అత్యధిక సీట్లు, ఓట్లు 1984లో కాంగ్రెస్ పార్టీ సాధించింది. అదికూడా ఇందిర హత్యానంతరం రాజీవ్ పగ్గాలు చేపట్టినప్పుడు మాత్రమే సాధ్యం అయ్యింది. ఇందిరా గాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 48.1 శాతం ఓట్లతో 415 సీట్లు గెలుచు కోగలిగింది. 415 సీట్లను గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 50 శాతం దాటలేదు. ఇందిరా గాంధీ హత్య తర్వాత దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ 48.1 శాతం ఓట్లతో 415 సీట్లు గెలుచు కోగలిగింది, ఇది ఇప్పటి వరకు అతిపెద్ద రికార్డు. కాంగ్రెస్ 7 సార్లు పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ఒక్కసారి కూడా 50 శాతం ఓట్లు సాధించలేకపోయింది. ప్రస్తుతం బీజేపీ మాత్రం 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలవడమే కాకుండా 50 శాతం ఓట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2024 ఎన్నికల్లో తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు బీజేపీ అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. 50 శాతం ఓట్లు దాటాలంటే బీజేపీకి 2019 కంటే 12 శాతం అధికంగా ఓట్లు రావాలి.

## కెసిఆర్‌కు కరువు ఎప్పుడు వస్తుందో తెలియదా

**రంగారెడ్డి:** వేలాది పుస్తకాలు చదివిన పెద్దమనిషి కెసిఆర్‌కు కరువు ఎలా వస్తుందో పుస్తకాల్లో చదవలేదా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే కరువు పేరుతో రైతుల వద్దకు వెళ్లడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. పదేళ్ల తరువాత కేసీఆర్‌కు రైతులు గుర్తుకు వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ కరువు తెచ్చిందని అంటున్నారని, కరువు ఎలా వస్తుందో తెలియదా అని అన్నారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్ లో కేసీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పరిస్థితి చూసి సానుభూతి తెలియజేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని కేసీఆర్ అంటున్నారని .. వర్షాలు ఎప్పుడు పడ్డాయో చెప్పాలన్నారు. వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ కు కరువు ఎప్పుడు వస్తుందో తెలియదా అని సీఎం ప్రశ్నించారు. తుక్కుగూడలో ఈనెల 6వ తేదీన ఏఐసీసీ భారీ బహిరంగ సభకు ఎ÷-లాన్ చేసిందని.. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకానున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు తుక్కుగూడ సభా ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, మంత్రులు పరిశీలించారు. సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నిర్వాహకులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా వందశాతం పనిచేయాలని, ఆయన చేసిన సూచనలను ప్రభుత్వం స్వీకరిస్తుందని తెలిపారు. 200 మంది రైతులు చనిపోయారని కేసీఆర్ అంటున్నారని.. నిజంగా చనిపోతే వివరాలు ఇస్తే నష్టపరిహార ఇచ్చి రైతులను అదుకుంటామని రేవంత్ ప్రకటించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ విధ్వంసానికి గురైందని ఆరోపించారు. కాంగ్రెస్ కు తెలంగాణ ప్రత్యేక స్థానం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తుక్కుగూడ జన జాతర సభకు ఖర్గే, రాహుల్, ప్రియాంక, ముఖ్య నేతలంతా వస్తున్నారని చెప్పారు. ఈ సభలో జాతీయ ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్ చేస్తామని తెలిపారు. అదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని సీఎం కోరారు. గతంలో ఆరు గ్యారంటీలను తుక్కగూడ సభలోనే ఇచ్చామని.. అందులో 5 గ్యారెంటీలను అమలు చేశామన్నారు. తెలంగాణ నుంచి నేషనల్ మేనిఫెస్టో రిలీజ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ కు తెలంగాణ కంచుకోట అని నిరూపిస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే... రాష్ట్రానికి జరిగే మేలును ఈ సభ ద్వారా తెలియజేస్తామని చెప్పారు. ఈ సభలో మహిళలకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీలను తెలంగాణలో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల కోడ్ రావడంతో పథకాలకు కొంత అంతరాయం కలిగిందని చెప్పారు. ఎన్నికల తర్వాత మిగతా హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల తర్వాత అయినా మాజీ సీఎం కేసీఆర్ 'పొలం బాట' పట్టడం
సంతోషమని చెప్పారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినందుకు, కవిత జైలుకు పోయినందుకు కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుందని అన్నారు. ఆయనకు ఏ సీజన్ ఎప్పుడు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాపాలతోనే ఈ కరువు పరిస్థితులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఆయనను పాపాల భైరవుడు అన్నా తక్కువేనని అన్నారు. ఆయన చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలో వేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధును వేయడానికి 10 నెలల సమయం తీసుకుందని చెప్పారు. 65 లక్షల రైతుల ఖాతాలో తాము రైతుబంధు వేశామని.. మిగిలింది 4 లక్షల రైతులేనని ఎన్నికలు అయిపోగానే వీరికి కూడా రైతు బంధు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ మొన్నటి పర్యటనలో జనరేటర్‌తో ప్రెస్‌మీట్ పెట్టి విద్యుత్ పోయిందని తమ ప్రభుత్వంపై నిందలు వేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాము ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే తమను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాము తలుచుకుంటే కేసీఆర్ బయటకు వెళ్లేవారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1500 కోట్లు ఉన్నాయని.. రైతులకు రూ.100 కోట్లు సహాయం చేయొచ్చు కదా అని చెప్పారు. ఎంపీ ఎన్నికల కోసమే కేసీఆర్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు. చనిపోయిన రైతుల వివరాలు ఇచ్చేందుకు కేసీఆర్‌కు 48 గంటల సమయం ఇస్తున్నానని అన్నారు. ఆ లోగా రైతుల వివరాలు ఇస్తే ఎన్నికల కోడ్ ముగియగానే రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కేసీఆర్ న్యాయమైన సలహాలు, సూచనలు ఇస్తే అమలు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. తాము ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి తెలంగాణ హక్కులు సాధిస్తున్నామని.. అందుకే అక్కడకు వెళ్తున్నామని అన్నారు. కేసీఆర్ కుటుంబ దోపిడీ నుంచి రాష్ట్రాన్ని కాపాడి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేసీఆర్ పాపాల వల్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు పారిపోతున్నారని దెప్పిపొడిచారు. ఆ పార్టీ నేతలను కాపాడుకోవడానికి కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ చెల్లని వెయ్యి రూపాయల నోటని ఎద్దేవా చేశారు. జూన్ 9వ తేదీ తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని అన్నారు. ఆ రోజే ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌లో కొత్త పథకాలను అమలు చేయడానికి అవకాశం లేకుండా పోయిందని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని పథకాలను రాష్ట్రంలో అమలు చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్ని సమస్యలు ఉన్నాయని నీళ్లు ఎత్తిపోయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని... ఈ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కుట్రకు తెరదీశాయని అన్నారు.

# ఏపిలో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల

**న్యూఢిల్లీ:** ఏపీలో 5 పార్లమెంటు, 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. లోక్‌సభ బరిలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఉండనున్నారు. కడప పార్లమెంటు స్థానం నుంచి పోటీలో షర్మిల పోటీ చేస్తారు. కాకినాడ స్థానం నుంచి కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లం రాజు, రాజమండ్రి స్థానం నుంచి పిసిసి మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు, బాపట్ల స్థానం నుంచి కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, కర్నూలు నుంచి రాంపుల్లయ్య యాదవ్ అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. అలాగే 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఆర్థర్ నందికొట్కూరు నుంచి..ఎలీజా చింతలపూడి నుంచి సిట్టింగ్ స్థానాల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయనున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఎక్కువ మంది కొత్త వారే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. కొన్ని చోట్ల ప్రముఖ నేతలు ఎవరైనా పోటీ చేయాడానికి ఆసక్తి చూపిస్తే వారికి అవకాశం కల్పించారు. కొత్తంగా 175స్థానాలకు గాను 114 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. శక్తివంచన లేకుండా ప్రయత్నించే వారికే టిక్కెట్లు దక్కినట్లుగా తెలుస్తోంది.ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడిన తర్వాత ఆ పార్టీ పోటీ చేస్తుందా లేదా అన్నదానిపై పెద్దగా ఎవరు ఆసక్తి చూపించలేదు.కానీ ఈ సారి షర్మిల ఏపీ పీసీసీ చీఫ్ గా బాధ్యతలు తీసుకోవడంతో పాటు రాష్ట్రం మొత్తం విస్తృతంగా పర్యటించడంతో.. మంచి ఓటు బ్యాంక్ సాధిస్తుందన్న నమ్మకంతో కాంగ్రెస్ శ్రేణుల యాక్టివ్ అవుతున్నాయి. షర్మిల స్వయంగా లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. తొలి జాబితాలో పులివెందులకు ఎవరి పేరూ ఖరారు చేయలేదు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె లేకపోతే ఆమె తల్లి ఎన్నికల్ల పోటీ చేసే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. కానీ? ఇంత వరకు ఖరారు కాలేదు., వారు నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. వైఎస్ సునీత పోటీకి అంగీకరిస్తే ఆమె పోటీ చేసే అవకాశం ఉంది. అయితే తమ టా÷-గ్గ÷ట్ అవినాష్ రెడ్డి అని..ఆయనను ఓడించడమే లక్ష్యమని సునీతారెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో పులివెందులలో పోటీ చేస్తారా లేదా అన్నదానిపై స్పష్టతలేదు. అయితే లోక్ సభకు షర్మిల పోటీ చేస్తున్నందున.. పులివెందుల నుంచి కూడా వైఎస్ కుటుంబం నుంచే ఒకరు పోటీ చేయడం ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఆ అభ్యర్థి ఎవరనేది.. మరో వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. షర్మిల, అవినాష్ రెడ్డి మధ్య గట్టి పోటీ జరగం ఖాయంగా కనిపిస్తోంది.

# ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ.



**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఏప్రిల్ 2:**

ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించకుండా పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంపు , అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి ఎద్దడి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు కూలీలు తక్కువ సంఖ్యలో వస్తున్న గాంధారి, నసురుల్లాబాద్, బిచ్కుంద మండలాల ఎంపీడీవోలు రాజేశ్వర్, గోపాల్, నీలావతికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. గ్రామస్థాయిలో కూలీలకు అధికారులు అవగాహన కల్పించి పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు వచ్చే విధంగా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీటి వసతి, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు, వాష్ బేషన్స్ సక్రమంగా ఉండే విధంగా చూడాలని చెప్పారు. తరగతి గదుల మైనర్ మరమమత్తులు చేయాలని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఇంజనీరింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి పక్కాగా ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనా కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ 5లోగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు.




గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. తాగునీరు గ్రామాల్లో వృధా కాకుండా చూడాలన్నారు. తాగునీటిని వృధా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను అద్దెకు తీసుకొని వినియోగించుకోవాలని కోరారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా లో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలని పేర్కొన్నారు. 60 ఏండ్లు దాటిన వృద్ధులను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిద్రించకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి వసతి, నీడ కల్పించాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాల ధాన్యం తెలంగాణ రాష్ట్రానికి రాకుండా రెండు చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఆశ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వారి వద్ద అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండే విధంగా అధికారులు చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పి సీఈవో చందర్ నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, పంచాయతీ రాజ్ ఈఈ సదాశివరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఠాకూర్ బీడీ యాజమాన్యంతో చర్చలు సఫలం.

**బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్దిరాములు.**

**పాల్గొన్న వివిధ బీడీ కార్మిక సంఘాల నాయకులు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 2:**

కార్మికుల సమస్యలపై ఠాకూర్ సౌదేకర్ బీడీ యాజమాన్యం తో మంగళవారం జరిగిన చర్చలు సఫలం అయ్యాయని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్దిరాములు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బట్వాడా, పని దినాలు పెంపు, నాన్ పీఎఫ్ కార్మికులకు నెంబర్లు ఇవ్వడానికి బీడీ యాజమాన్యం ఒప్పుకున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రం లో ఉన్న ఠాకూర్ సౌదేకర్ బీడీ యాజమాన్యంతో డిచ్‌పల్లి బీడీ సెంటర్ లో పనిచేస్తున్న బీడీ కార్మికుల సమస్యల పై కంపెనీ జనరల్ మేనేజర్ బాల్ కిషన్, సూపర్వేజర్ నర్సయ్య, మేనేజర్లు సత్యనారాయణ, బాల్ కిషన్ సమక్షంలో చర్చలు జరిగాయని తెలిపారు. ఈ చర్చలో బీడీ కార్మిక సంఘాల జెఎసి నాయకులు, బిఎల్ టీయూ, ఐఎఫ్ టీయూ, తెలంగాణ బీడీ పేడరేషన్ నాయకులు సయ్యద్, వెంకటి, ,బాల్ రాజు, ఉప్పు లక్ష్మన్, మదు, నారాయణ తదితరులు పాల్గొన్నట్టు సిద్దిరాములు తెలిపారు. చర్చల్లో గత 5 నెలలు గా పెండింగ్‌లో ఉన్న బట్వాడా లు జూన్ నెల వరకు పూర్తి చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే నాన్ పీఎఫ్ బీడీ కార్మికులకు నెంబర్లు, బ్రాంచ్ కి 45 వరకు మే నెలలో భర్తి చేస్తామని, పని దినాలు, ప్రొడక్షన్, కోట పెంపుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం డిచ్‌పల్లి సెంటర్ లో పనిచేస్తున్న కార్మికులకు లక్ష నలభై వెయ్యి ల బీడీ ప్రొడక్షన్ ఇవ్వడానికి ఒప్పుకున్నారని అన్నారు. వెయ్యి బీడీ లకు నాణ్యమైన తుకాకు ఇవ్వడానికి ఒప్పుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో డిచ్‌పల్లి ఠాకూర్ సౌదేకర్ బీడీ సెంటర్ టేకేదార్లు మంత్రి సుదర్శన్, జ్ఞానేశ్వర్, ముత్తేష్, నాగభూషణం, తిమ్మప్ప, లక్ష్మణ్, సాయిలు పాల్గొన్నారు.

# అటిజం లక్షణాలను మొదట్లోనే గుర్తించాలి.

**ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్.**

**స్నేహ సొసైటీలో ప్రపంచ అటిజం అవగాహన దినోత్సవం.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఏప్రిల్ 2:**




పిల్లల్లో బుద్ధి మాంధ్యం, పదేపదే మాట్లాడడం, సరిగ్గా మాట్లాడ లేకపోవడమే అటిజం లక్షణాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ తెలిపారు. నవజాత శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు గుర్తించి సరైన చికిత్స అందించినట్లయితే వారు అటిజం బారిన పడకుండా చూడవచ్చని తల్లిదండ్రులకు తెలిపారు, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాల మరియు ఇండియన్ సైకియాట్రిస్ట్ అసోసియేషన్ మరియు తెలంగాణ మెంటల్ హెల్త్ కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ అటిజం అవగాహన దినోత్సవాన్ని స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ మాట్లాడుతూ, నవజాత శిశు వు నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో మాటలు సరిగ్గా రాకపోవడం బుద్ధి మా%శీ%ద్యం అలాగే పదేపదే మాట్లాడడం అలాగే విచిత్రంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు ఉండడాన్ని అటిజం బారిన పడ్డ పిల్లలుగా గుర్తించడం జరుగుతుందన్నారు. అయితే ఈ అటిజం బారిన పడడానికి చాలా రకాల కారణాలు ఉంటాయని ఆయన చెప్పారు. మహిళలు గర్భంతో ఉన్న సమయంలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం అలాగే సరైన మందులు వాడకపోవడం అలాగే శరీరానికి పోషకాహారాలు లేని అనవసర ఆహార పదార్థాలు తీసుకోవడం అలాగే మత్తు పానీయాలు తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆర్టిజన్ బారిన పడతారని చెప్పారు. తల్లిదండ్రులు చిన్నప్పుడే ఈ విషయాన్ని గమనించి వారికి సరైన పోషక ఆహారం ఇవ్వడం వారిని ప్రోత్సహించే విధంగా వైద్యుల సలహాలతో ముందుకు వెళ్లినట్లయితే వారు ఉన్నత స్థాయికి ఎదగాగలరని తెలిపారు. ఇప్పటికే ఎంతోమంది అటిజం బారిన పడిన కూడా ఏదోరంగంలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాలని వారు చెప్పారు.. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి మాట్లాడుతూ ఆర్టిజం బారిన పడ్డ వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ఎలా పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి మానసిక వైద్యులు డాక్టర్ ఆకుల విశాల్ విషయాలు క్లుప్తంగా వివరించడం ఎంతో అభినందనీయమన్నారు. త్వరలో అటిజం బారిన పడ్డ పిల్లలకు వారి

తల్లిదండ్రులకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అటిజం పట్ల అవగాహన కల్పించేందుకు సహకారం అందించాలని వైద్యులు డాక్టర్ విశాల్ ను కోరారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి స్నేహ సొసైటీ విద్యార్థులు, మరియు అటిజం భారిన పడిన పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులకు బోనస్ గా క్వింటాల్ కు రూ. 500 ఇవ్వాలి.

**- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం డిమాండ్. కలెక్టర్ కు వినతి పత్రం.**





వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు చేయాలని, రైతులకు వరి ధాన్యానికి బోనస్ గా క్వింటాల్ కు రూ. 500 చెల్లించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ సభాపతి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలోని ఈ బృందంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హన్మంత్ షిండే, జహీరాబాద్ పార్లమెంట్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు డి అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు ఉన్నారు.

**ఈసందర్భంగా పోచారం మీడియాతో మాట్లాడుతూ,**

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకు రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించాం అని అన్నారు.అధికారంలోకి వచ్చిన తరువాత 100 రోజుల్లో వరి ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర కంటే అదనంగా రూ. 500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలలో ఇది కూడా ఒకటి అని, కాంగ్రెస్ పార్టీ అలివికాని హామీలను ఇచ్చి రైతులను, పేదలను మోసం చేయడం సరికాదన్నారు. వానాకాలం పంట పోయింది, అయినా ఎక్కడా బోనస్ ఇవ్వలేదన్నారు.యాసంగి ధాన్యం కొనుగోలు కోసం నిన్నటి నుండి ప్రభుత్వ మద్దతు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, కాబట్టి కొనుగోలు చేస్తున్న ధాన్యానికి బోనస్ రూ. 500 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.ఒకవేళ మీరు బోనస్ చెల్లించకపోతే రైతులకు మద్దతుగా ఎప్రిల్ 6న ప్రతి నియోజకవర్గ కేంద్రంలో దీక్ష చేస్తాం అన్నారు. ప్రభుత్వం అప్పటికే దిగి రాకపోతే కొనుగోలు కేంద్రాల వద్ద నిరసనలు, ధర్నాలు చేస్తాం అని హెచ్చరించారు. అదేవిధంగా అకాల వర్షాలు, నీళ్ళు లేక ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలన్నారు. డిసెంబర్ 9న అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించి, ఇప్పుడేమో ఎన్నికల కోడ్ అంటున్నారని అన్నారు.

# పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

**- పీ.ఓ, ఏ.పీ.ఓల శిక్షణ తరగతుల్లో కలెక్టర్.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 02**

ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మే 13 న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫెలిసిటేషన్ సెంటర్లు, పీ.ఓలు, ఏ.పీ.ఓలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వర్తించిన సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి పలువురి నుండి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీ.ఓలు, ఏ.పీ.ఓ లను ఉద్దేశించి కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఇదివరకు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు సైతం ట్రైనింగ్ క్లాసులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ డే సందర్భంగా పి.ఓ లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి క్లుప్తంగా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. కొందరు పి.ఓ లు శిక్షణ కు రాకుండా అంతా తమకు తెలిసిందేనని అతి విశ్వాసంతో తప్పులు చేస్తారని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈ.వి.ఎం లు తీసుకొని పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వవలసిన బాధ్యత పి.ఓ లేదన్నారు. పొలిటికల్ ఏజెంట్ మిమ్ములను ప్రశ్నించే అవకాశం ఉంటుంది. దానికి సమాధానం చెప్పాల్సింది పి.ఓ అధికారి దే పూర్తి బాధ్యత. పోలింగ్ డే రోజు మీరే బాస్ ఎవ్వరికీ బాధ్యత ఉండదని, పోల్ తర్వాత రిపోర్ట్ తయారు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ని సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# బీజేపీలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం చేరిక.



**వేగుచుక్క న్యూస్, ప్రతినిధి, ఏప్రిల్ 2**

సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, నారాయణఖేడ్ సీనియర్ నాయకులు సంగమేష్ రెడ్డి మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జి తరుణ్ చుగ్ ఆధ్వర్యంలో, ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో వారు బీజేపీ పార్టీలో చేరారు. వారికి కాషాయ కండువా కప్పి తరుణ్ చుగ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్ తో పాటు జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రవి గౌడ్ పాల్గొన్నారు.



## అసలు టైమొచ్చింది!!

మార్చి 12వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ప్రభాస్.. కన్నప్ప షూట్ లో పాల్గొనున్నారట. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేకమైన సెట్ లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట మేకర్స్. టాలీవుడ్ నటుడు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. మధు బాల, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, శరత్ కుమార్ వంటి స్టార్ నటీనటులు యాక్ట్ చేస్తున్న ఈ సినిమాను ముకేశ్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్ తో డైలాగ్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఇటీవల న్యూజిలాండ్ ఈ చిత్రం రెండు షెడ్యూళ్ల షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అయితే ఈ సినిమాలో ప్రభాస్ నటిస్తున్నట్లు గతంలో నటి మధు బాల వెల్లడించారు. ఆ తర్వాత ప్రభాస్ రోల్ పై మంచు విష్ణు కూడా మాట్లాడారు. సినిమాలో ప్రభాస్ పాత్ర అద్భుతంగా ఉంటుందని, సమయం వచ్చినప్పుడే డార్లింగ్ రోల్ కు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని విష్ణు చెప్పారు. దీంతో ఫ్యాన్స్ లో ప్రభాస్ రోల్ పై మంచి ఆసక్తి నెలకొంది. ప్రభాస్, నయనతార.. శివపార్వతుల పాత్రల్లో కనిపిస్తారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది.ఇప్పుడు కైలాసంలోని శివపార్వతులకు సంబంధించిన షాట్స్ తోపాటు క్లైమాక్స్ సీన్స్ ను షూట్ చేయడానికి కన్నప్ప మేకర్స్ సిద్ధమయ్యారట. అందుకు తన పాత్రను పూర్తి చేయడానికి ప్రభాస్ ఐదు రోజుల కాల్ షీట్స్ ఇచ్చారట. మార్చి 12వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ప్రభాస్.. కన్నప్ప షూట్ లో పాల్గొనున్నారట. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేకమైన సెట్ లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట మేకర్స్. అయితే అంతా అనుకుంటున్నట్లు ప్రభాస్.. నిజంగానే శివుడి పాత్రలో కనిపించబోతున్నారా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఈ మూవీకి ప్రభాస్ ఒక్క రూపాయి కూడా రెమ్యునరేషన్ తీసుకోకుండా స్పెషల్ రోల్ లో నటిస్తున్నట్లు ఇదివరకే కొన్ని గాసిప్స్ వచ్చాయి. మరి ఇది ఎంతవరకు నిజమో చిత్ర యూనిట్ క్లారిటీ ఇవ్వాలి. మంచు విష్ణు.. ప్రభాస్ కు స్పెషల్ రిటర్న్ గిఫ్ట్ కూడా ఇవ్వనున్నారట. ప్రభాస్ ఈ సినిమాలో భాగమవ్వడంతో వరల్డ్ వైడ్ గా ఉన్న ఆయన ఫ్యాన్స్ కూడా వెయిట్ చేస్తున్నారు.కలెక్షన్స్ గురించి ఆలోచించలేదు' ముకేశ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో మంచు విష్ణు సరసన ప్రీతీ ముకుందన్ ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్నారు. రూ.150 కోట్ల బడ్జెట్ తో మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ సినిమాకు స్టీఫెన్ దేవస్సీ, మణిశర్మ మ్యూజిక్ అందిస్తున్నారు. మోహన్ బాబు నిర్మిస్తూనే ముఖ్య పాత్రలో కూడా కనిపించనున్నారు. విష్ణు కుమారుడు అవ్రామ్ కూడా ఓ పాత్రలో నటిస్తున్నాడు.



## మైనపు విగ్రహం..



అల్లు అర్జున్ మైనపు విగ్రహావిష్కరణకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట్లో ఎంతగా వైరల్ అవుతున్నాయో అందరికీ తెలిసిందే. అయితే బన్నీ మైనపు విగ్రహం మీద మెగా ఫ్యామిలీ నుంచి భారీ ఎత్తున స్పందన వచ్చింది. వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్, లావణ్య, ఉపాసన ఇలా అందరూ స్పందించారు.

అల్లు అర్జున్ మైనపు విగ్రహావిష్కరణ దుబాయ్‌లో గ్రాండ్‌గా జరిగింది. మేడం టుస్సాడ్స్ మ్యూజియంలో బన్నీ మైనపు విగ్రహాన్ని గురువారం నాడు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో అల్లు ఫ్యామిలీ సందడి చేసింది. ఇక నెట్టింట్లో బన్నీ మీద ప్రశంసలు కురిపించారంతా. మెగా ఫ్యామిలీ నుంచి సాయి ధరమ్ తేజ్, నాగబాబు, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, ఉపాసన వంటి వారు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నాగబాబు స్పెషల్‌గా వేసిన ట్వీట్‌కు బన్నీ వెంటనే స్పందించాడు. థాంక్యూ బాబాయ్ అని కామెంట్ పెట్టాడు. అయితే బన్నీకి ఇంతటి గౌరవం దక్కిన ఈ సందర్భంగా రామ్ చరణ్, చిరంజీవి వంటి వారు మాత్రం సోషల్ మీడియా వేదికగా స్పందించలేదు. ఈ మేరకు రామ్ చరణ్ గానీ, చిరంజీవి గానీ పోస్టులు, ట్వీట్లు వేసినట్టుగా ఎక్కడా కనిపించలేదు. రామ్ చరణ్, చిరంజీవిలు బన్నీని అభినందిస్తూ ట్వీట్లు వేయడం లేదని కొంత మంది కామెంట్లు చేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో పోస్టులు వేస్తేనే స్పందించినట్టా? అని మెగా ఫ్యాన్స్ కౌంటర్లు వేస్తున్నారు. మామూలుగా అయితే చిరంజీవి ఇలాంటి విషయాల్లో ముందుగానే విష్ చేస్తాడు. సోషల్ మీడియాలోనూ ట్వీట్లు, పోస్టులు వేస్తుంటాడు. అయితే బన్నీ మీద ఇంత వరకు ట్వీట్ వేయకపోవడంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. అయితే బన్నీకి ఫోన్‌లోనే చిరంజీవి, రామ్ చరణ్ విషెస్ చెప్పి ఉంటారని, ఫ్యామిలీ మెంబర్ల మధ్యలో ఈ ఫార్మాలిటీస్ ఏంటని ఇరువురు అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. బన్నీ మైనపు విగ్రహావిష్కరణ మీద ఉపాసన స్పందించారు. వావ్ అమేజింగ్.. కంగ్రాట్స్ అంటూ ఉపాసన ఇన్ స్టాలో కామెంట్ పెట్టారు. దానికి స్పందిస్తూ బన్నీ.. హార్ట్ సింబల్స్‌ను పెట్టాడు. రామ్ చరణ్, చిరంజీవి ఇరువురు కూడా షూటింగ్‌లతో బిజీగా ఉండటంతో ఇలా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేరేమో.. అందుకే స్పందించలేదేమో అని అంతా అనుకుంటున్నారు. రామ్ చరణ్ బిజీగా ఉండటం మూలానే.. బర్త్ డే విషెస్ చెప్పిన వారికి తిరిగి ఇంకా రిప్లై ఇవ్వలేదు.

## అతనితో నాని చేయాల్సిన సినిమా ..!



నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా తమ్ముడు. పవర్ స్టార్ టైటిల్ తో ఆయన వీరాభిమాని నితిన్ వస్తున్నాడు. ఒక హీరోకి అనుకున్న సినిమా మరొక హీరో చేయడం సర్వసాధారణం. ఎందుకంటే డైరెక్టర్ చెప్పిన పాయింట్ నచ్చినా వారికున్న కమిట్మెంట్స్ వల్ల కొన్ని సినిమాలు వదులుకోవాల్సి వస్తుంది. లేదా పాయింట్ బాగున్నా దాని ఎగ్జిక్యూషన్ ఎలా ఉంటుందో అనే డౌట్ తో వదులుకుంటారు. అయితే అలా వదిలిన సినిమాలు హిట్ అయితే అనవసరంగా ఒక హిట్ సినిమా మిస్ చేసుకున్నామే అన్న భావన కలుగుతుంది. హీరోలు వారి వారి కమిట్మెంట్స్ ని బట్టి సినిమాలు చేస్తుంటారు. ప్రస్తుతం అలానే ఒక హీరో కాదన్న సినిమా మరో హీరో చేశాడు. ఈరోజు ఆ సినిమా ఫస్ట్ లుక్ కూడా వచ్చింది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్‌లో వస్తున్న సినిమా తమ్ముడు. పవర్ స్టార్ టైటిల్ తో ఆయన వీరాభిమాని నితిన్ వస్తున్నాడు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా బ్రదర్ సెంటిమెంట్ తో రాబోతుందని టైటిల్ చూస్తేనే అర్ధమవుతుంది. ముందు ఈ సినిమాను నానితో చేయాలని ప్రయత్నించారు. అయితే నానికి కథ నచ్చినా ఆల్రెడీ సినిమాలో భూమికతో కలిసి నటించాడు. ఆ సినిమాలో భూమిక వదిన అయినా ఆమెకు ఆపద వస్తే తమ్ముడిలా ఆమె ముందు నిలబడ్డాడు. కలెక్షన్స్ గురించి ఆలోచించలేదు' వేణు శ్రీరాం తమ్ముడు సినిమా కూడా బ్రదర్ సెంటిమెంట్ ఉంటుందని అర్థమవుతుంది. కథ బాగున్నా నాని సీన్ రిపీట్ అవుతుందని భావించి తమ్ముడు సినిమాకు నో చెప్పి ఉండొచ్చని చెబుతున్నారు. నాని ఈమధ్య సూపర్ ఫాం లో ఉన్నాడు. మొన్నటిదాకా నాని కేవలం క్లాస్ సినిమాలే చేస్తాడని అనుకున్న ఆడియన్స్ కు దసరా సినిమాతో సర్ ప్రైజ్ చేశాడు. నాని కథ ఓకే చేశాడు అంటే అందులో కచ్చితంగా మ్యాటర్ ఉన్నట్టే లెక్క అని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. ఐతే తమ్ముడు సినిమా మాత్రం కథ బాగున్నా కూడా తను ఇదివరకు ఆల్రెడీ అలాంటి సినిమా చేశాడు కాబట్టే ఆ సినిమా వద్దనుకున్నాడని చెప్పుకుంటున్నారు. అయితే లేటెస్ట్ గా రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తే మాత్రం తమ్ముడు గా నితిన్ ఈసారి గట్టిగా కొట్టేలానే ఉన్నాడు. నాని కాదన్న కారణం ఏమో కానీ తమ్ముడుతో నితిన్ ఒక మంచి మాస్ హిట్ అందుకునేలా ఉన్నాడని చెప్పొచ్చు. కెరీర్ లో హిట్ల కన్నా ఫ్లాపుల సంఖ్య ఎక్కువగా ఉన్నా సరే తనదైన సినిమాలతో అలరించేందుకు వస్తున్న నితిన్ రాబోయే రెండు సినిమాలతో హిట్ టార్గెట్ పెట్టుకున్నాడు. మరి నాని కాదన్న తమ్ముడు నితిన్ కు లక్ కలిసి వచ్చేలా చేస్తుందా లేదా అన్నది చూడాలి.



## వంద కోట్ల క్లబ్బులో టిల్లు!..

టిల్లు స్క్వేర్ సినిమాకు మంచి టాక్ వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోయింది. ఈ చిత్రానికి అదిరిపోయే ఓపెనింగ్స్ వస్తాయని, వంద కోట్ల క్లబ్బులో జాయిన్ అవుతుందని నిర్మాత నాగవంశీ చెప్పుకొచ్చాడు. మరి టిల్లు స్క్వేర్ లాంగ్ రన్‌లో ఎలాంటి విజయాన్ని నమోదు చేసుకుంటుందో చూడాలి.

సిద్దు జొన్నలగడ్డ డీజే టిల్లు అందరినీ మాయచేశాడు. నేహా శెట్టి రాధికగా.. సిద్దు టిల్లుగా చేసిన ఆ మూవీ బ్లాక్ బస్టర్ అయింది. ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. మళ్లీ ఆ మ్యాజిక్ రిపీట్ చేసి, బాక్సాఫీస్ వద్ద హిట్టు కొట్టేందుకు టిల్లు స్క్వేర్‌ను దింపారు. సిద్దు, అనుపమ జంటగా తెరకెక్కిన ఈ మూవీ మీద ఎంతగా ట్రోలింగ్, నెగెటివ్ కామెంట్లు వచ్చాయో అందరికీ తెలిసిందే. అన్ని కాంట్రవర్సీలు పక్కకిపోయి.. నేడు ఈ మూవీ థియేటర్లోకి వచ్చింది. మొదటి షోతోనే పాజిటివ్ టాక్‌ను తెచ్చుకుంది. దీంతో ఎక్కడ చూసినా టిల్లు గాడి రచ్చే కనిపిస్తోంది. నన్ను నమ్మి, ఇలాంటి సబ్జెక్టుని నమ్మి, మంచి బడ్జెట్‌తో 'డీజే టిల్లు' చిత్రాన్ని రూపొందించారని, ఆ సినిమా ఘన విజయం సాధించిందని, ఆ తర్వాత సీక్వెల్ అవకాశం కూడా ఇచ్చారని అందుకు నిర్మాతకు థాంక్స్ చెప్పాడు సిద్దు జొన్నలగడ్డ. టిల్లు స్క్వేర్ కి థియేటర్లలో మంచి స్పందన లభిస్తుండటం ఆనందం కలిగిస్తోందన్నాడు. విడుదలకు ముందే ఈ సినిమా అదిరిపోతుంది అని నాకు తెలుసని సిద్దు చెప్పుకొచ్చాడు. కానీ విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి ఆ మాట వినాలని ఆగానని అన్నాడు. అందుకే ఈ మాట ఇప్పుడు చెబుతున్నాను ఈ సినిమా అదిరిపోయిందని అన్నాడు. దీనికి కారణమైన ప్రతి ఒక్కరికీ థాంక్స్ చెప్పుకొచ్చాడు సిద్దు. ఇక నిర్మాత నాగవంశీ ఈ మూవీ గురించి మాట్లాడుతూ.. టిల్లు స్క్వేర్ వంద కోట్ల గ్రాస్ వసూలు చేస్తుందనే నమ్మకం ఉందని అన్నాడు. మొదటి రోజే దాదాపు 25 కోట్ల గ్రాస్ వస్తుందని అంచనా వేశాడు. సినిమాకి మంచి టాక్ వస్తోందని చెప్పుకొచ్చాడు. మార్నింగ్ షోకి, మ్యాట్నీకి వసూళ్లలో గ్రోత్ కనిపిస్తుందన్నాడు. ఉగాది, రంజాన్ పండగలు, వేసవి సెలవులు ఉండటంతో ఈ సినిమా వంద కోట్లు వసూలు చేస్తుందనేని నమ్ముతున్నాను అని చెప్పుకొచ్చాడు.

## ఈ రేంజ్‌లో ఉహించలేదు



యువ కథానాయకుడు విశ్వక్ సేన్.. టాలీవుడ్ లో తన కంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. యువ కథానాయకుడు విశ్వక్ సేన్.. టాలీవుడ్ లో తన కంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్నారు. వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. మాస్ కా దాస్ గా పేరు గాంచారు. ఓ రేంజ్ లో ఫ్యాన్ బేస్ సొంతం చేసుకున్నారు. అయితే యంగ్ హీరోల్లో ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ ఎవరంటే విశ్వక్ సేన్ అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇటీవల ప్రయోగాత్మక చిత్రం గామితో వచ్చి హిట్ అందుకున్నారు. ఇప్పుడు మరో ప్రయోగాత్మక మూవీ లైలాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా అఫీషియల్ అనౌన్స్మెంట్ నిన్ననే వచ్చింది. ఆ సమయంలో స్పెషల్ వీడియో కూడా రిలీజ్ చేశారు మేకర్స్. మేకప్ కిట్, అద్దం తదితర వస్తువులతోపాటు చివర్లో గన్ నుంచి బుల్లెట్ కు బదులు లిప్ స్టిక్ వస్తున్నట్టుగా మేకర్స్ చూపించారు. దీంతో అసలు ఈ సినిమా కాన్సెప్ట్ ఏంటబ్బా అని నెటిజన్లు అంతా తెగ చర్చించుకుంటున్నారు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ లేడీ గెటప్ లో కనిపించనున్నట్టు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఆ మధ్య విశ్వక్ కూడా లైలా రోల్ తానే చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. దీంతో లైలా రోల్ ను విశ్వక్ పోషించడం ఖరారైనట్లే. మేడమ్ మూవీలో రాజేంద్రప్రసాద్ లా ఫుల్ లెంగ్త్ లేడీ రోల్ లో విశ్వక్ సేన్ కనిపించనున్నారని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. కొత్త దర్శకుడు రామ్ నారాయణ్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ మూవీ ఫస్టాఫ్ లో విశ్వక్ లేడీ గెటప్ లో కనిపిస్తారని, సెకండాఫ్ అంతా చార్మినార్ బ్యాక్ డ్రాప్ లో క్రైమ్ కామెడీ జోనర్ లో ఉండనున్నట్లు తెలుస్తోంది. సెకండాఫ్ లో విశ్వక్ రగ్డ్ లుక్ లో కనిపిస్తారని సమాచారం. ఆకాంక్ష శర్మ ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. తనిష్క్ బాగ్చి ఈ మూవీకి సంగీతం అందిస్తూ టాలీవుడ్ లో అడుగుపెడుతున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ను ప్రారంభించనున్నారు మేకర్స్. కలెక్షన్స్ గురించి ఆలోచించలేదు' గతంలో మెగాస్టార్ చిరంజీవి, రాజేంద్ర ప్రసాద్, కమల్ హాసన్, మంచు మనోజ్, నరేష్, అల్లు అర్జున్ తోపాటు పలువురు నటులు లేడీ గెటప్స్‌లో కనిపించారు. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి రిలీజ్ తర్వాత లైలా సెట్స్ లో అడుగుపెట్టనున్నారు విశ్వక్. మరి వరుస హిట్లతో ఫుల్ జోష్‌లో ఉన్న విశ్వక్.. ఈ మూవీతో ఎలాంటి హిట్ కొడతారో, లేడీ గెటప్ లో ఎలా అలరిస్తారో చూడాలి.



## క్లిక్కయితే సమ్మర్‌లో కాసుల వర్షమే..

సిద్దు జొన్నలగడ్డ హీరోగా మల్లిక్ రామ్ దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకి వచ్చిన చిత్రం టిల్లు స్క్వేర్. ఈ సినిమాకి మొదటి రోజు పాజిటివ్ టాక్ రావడంతో ఏకంగా ప్రపంచ వ్యాప్తంగా 23.7 కోట్ల గ్రాస్ వసూళ్లు చేసింది. సిద్దు జొన్నలగడ్డ కెరియర్ లోనే హైయెస్ట్ ఓపెనింగ్ డే కలెక్షన్స్ గా వీటిని చెప్పుకోవాలి. సితార ఎంటర్టైన్మెంట్స్‌కి కూడా టిల్లు స్క్వేర్ సాలిడ్ లాభాలు తీసుకురావడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. వీకెండ్ తో పాటు సెలవులు కూడా కలిసి రానున్న నేపథ్యంలో థియేటర్స్ హౌస్ ఫుల్ కావడం గ్యారెంటీ అని ట్రేడ్ పండితులు అంటున్నారు. ఈ సినిమా నైజాం రిలీజ్ రైట్స్ ని దిల్ రాజు సొంతం చేసుకున్నారు. అయితే ఇదివరకే హారికా హాసినిలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా వచ్చిన చిత్రం గుంటూరు కారం. ఈ సినిమాతో దిల్ రాజు నైజాంలో దారుణంగా నష్టపోయారు. హనుమాన్ మూవీ గుంటూరు కారంపై గట్టి ప్రభావం చూపించింది. అయితే గుంటూరు కారంతో నష్టపోవడంతో దాని అనుబంధ సంస్థ సితార వారు టిల్లు స్క్వేర్ నైజాం రైట్స్ రిజనబుల్ రేటుకు దిల్ రాజుకి ఇచ్చారు. ఈ సినిమాకి పాజిటివ్ టాక్ రావడంతో యూత్ ఆడియన్స్ ను ఎక్కువగా ఆకట్టుకుంది. ముఖ్యంగా టిల్లు కథ తెలంగాణ బ్యాక్ డ్రాప్ లోనే ఉంటుంది. ఈ కారణంగా సినిమాకి నైజాంలో భారీ వసూళ్లు రావడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది. కలెక్షన్స్ గురించి ఆలోచించలేదు' గుంటూరు కారంతో నష్టపోయిన దిల్ రాజుకి టిల్లు సాలిడ్ జాక్ పాట్ ఇచ్చాడనే మాట ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. పోటీగా మరే పెద్ద సినిమాలు కూడా లేవు. కేవలం ఒక వారం తరువాత ఫ్యామిలీ స్టార్ రానుంది. అది కూడా దిల్ రాజు సినిమా కాబట్టి. టిల్లు సినిమాకు ఇబ్బంది లేకుండా థియేటర్స్ ను సెట్ చేయగలరు అని చెప్పవచ్చు. ఆ సినిమా కూడా సమ్మర్ భారీలో ఒంటరిగానే రిలీజ్ అవుతోంది కాబట్టి ఏమాత్రం క్లిక్కయినా దిల్ రాజుకి మరో జాక్ పాట్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇటీవల వచ్చిన ఫ్యామిలీ స్టార్ ట్రైలర్ కు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాగే టిల్లు స్క్వేర్ యూత్ ఆడియెన్స్ ను ఆకట్టుకుంటే ఫ్యామిలీ స్టార్ సినిమా మొత్తం ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఎట్రాక్ట్ చేసే అవకాశం ఉంది. ఇక అన్ని వర్గాల ఆడియెన్స్ తో డిస్ట్రిబ్యూటర్ గా అలాగే నిర్మాతగా రాజుగారు సాలిడ్ లాభాలు అందుకునే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కంప్లీట్ బోల్డ్ పెర్ఫార్మెన్స్ తో మెస్మరైజ్ చేసింది. సినిమా రిలీజ్‌కి ముందు లిల్లీ పాత్రపై విపరీతంగా ట్రోలింగ్ చేశారు. అయితే రాధిక తరహాలో లిల్లీ కూడా యూత్ కి చాలా కాలం పాటు గుర్తుండిపోతుందని భావిస్తున్నారు. టిల్లు గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అతని పెర్ఫార్మెన్స్, వన్ లైనర్ కామెడీని ఆడియన్స్ ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు.

## వాట్ ఏ పిక్..!

ఇంతకీ విజయ్ దేవరకొండ షేర్ చేసిన ఆ ఫోటో ఎవరిది అంటే దర్శకులు గౌతమ్ తిన్ననూరి, సందీప్ రెడ్డి వంగ. వచ్చే వారం ఫ్యామిలీ స్టార్ అంటూ థియేటర్ లోకి రాబోతున్న విజయ్ దేవరకొండ మొన్నటిదాకా సినిమాను తెలుగు వరకే రిలీజ్ అనుకోగా సడెన్ గా పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. రీసెంట్ గా చెన్నై వెళ్లి సినిమాను అక్కడ ప్రమోట్ చేసిన విజయ్ దేవరకొండ త్వరలో ముంబైలో కూడా ప్రమోట్ చేయనున్నాడు. ఫ్యామిలీ స్టార్ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ తన ఫేవరెట్ ఇద్దరు బోయ్స్ తో ఫోటో దిగాడు. ఆ ఫోటోని తన సోషల్ మీడియాలో షేర్ చేసి టూ ఫేవరెట్ బోయ్స్ అని మెసేజ్ పెట్టాడు. ఇంతకీ విజయ్ దేవరకొండ షేర్ చేసిన ఆ ఫోటో ఎవరిది అంటే దర్శకులు గౌతమ్ తిన్ననూరి, సందీప్ రెడ్డి వంగ. తనకు అర్జున్ రెడ్డి లాంటి హిట్ ఇచ్చి స్టార్ క్రేజ్ వచ్చేలా చేసుకున్న డైరెక్టర్ సందీప్ వంగ ఒక పక్క. తనతో నెక్స్ట్ సినిమా చేస్తున్న గౌతం తిన్ననూరి మరోపక్క విజయ్ దేవరకొండ ఆ ఇద్దరి మధ్య ఇచ్చిన స్టిల్ అదిరిపోయింది. సందీప్ రెడ్డి వంగ యానిమల్ సినిమా తీయగలిగాడు అంటే విజయ్ దేవరకొండ తనని నమ్మి అర్జున్ రెడ్డి ఛాన్స్ ఇచ్చాడు కాబట్టే అని చెప్పొచ్చు.కలెక్షన్స్ గురించి ఆలోచించలేదు' అంతేకాదు విజయ్ లోని నటుడిని బయటకు తీసిన క్రెడిట్ కూడా సందీప్ వంగా ఖాతాలో పడింది. విజయ్ దేవరకొండ, సందీప్ వంగా మళ్లీ కలిసి చేస్తే చూడాలని ఫ్యాన్స్ అంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.



ఇక గౌతం తిన్ననూరితో విజయ్ చేసే సినిమా త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. స్పై థ్రిల్లర్ గా గౌతం తో విజయ్ చేయబోతున్న సినిమాకు నెక్స్ట్ లెవెల్ ప్లానింగ్ ఉందని తెలుస్తుంది. జెర్సీ తో బాలీవుడ్ లో కూడా సక్సెస్ అందుకున్న గౌతం తిన్ననూరి విజయ్ తో చేసే సినిమాను కూడా పాన్ ఇండియా రేంజ్ లో ప్లాన్ చేస్తున్నాడు. ఇక సందీప్ వంగతో కూడా విజయ్ దేవరకొండ సినిమా ఉంటుందని తెలుస్తుంది. ఆమధ్య ఇద్దరు కలిసి అఫీషియల్ అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. సందీప్ వంగా లిస్ట్ లో ఫస్ట్ ప్రభాస్ నెక్స్ట్ అల్లు అర్జున్ ఉన్నాడు. ఆ ఇద్దరి తర్వాత విజయ్ దేవరకొండ సినిమా ఉండే ఛాన్స్ ఉంది. యానిమల్ సీక్వెల్ గా యానిమల్ పార్క్ అనే సినిమా కూడా సందీప్ వంగ చేస్తాడని తెలిసిందే. ఎప్పుడు చేసినా ఎలా చేసినా అర్జున్ రెడ్డి కాంబో రిపీట్ అయితే మాత్రం ఆ సినిమా లెక్క వేరే రేంజ్ లో ఉంటుందని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు.

## యాక్షన్ అవతార్‌లో సందీప్ కిషన్!



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ చాలా కాలం తర్వాత 'ఊరు పేరు భైరవకోన' సినిమాతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్నారు. టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ చాలా కాలం తర్వాత 'ఊరు పేరు భైరవకోన' సినిమాతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ఈ జోష్ లో బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ లైన్ లో పెడుతున్నారు. 'కెప్టెన్ మిల్లర్' తరువాత ధనుష్ తో కలిసి 'రాయన్' అనే చిత్రంలో నటిస్తున్న సందీప్.. తాజాగా తన 31వ సినిమాని అధికారికంగా ప్రకటించారు. ఈరోజు శనివారం 31 సినిమా టైటిల్ తో పాటుగా ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. సందీప్ కిషన్ తన నెక్స్ట్ మూవీ కోసం సెన్సేషనల్ హిట్ 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' మేకర్స్ తో చేతులు కలిపారు. టాలెంటెడ్ డైరెక్టర్ స్వరూప్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెం ట్ బ్యానర్ పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి (వైబ్) అనే ఆసక్తికరమైన ఇంగ్లీష్ టైటిల్‌ని ఫిక్స్ చేశారు. సినిమా నేపథ్యానికి తగ్గట్టుగా టైటిల్ లోగో హ్యాండ్ పంచ్‌గా డిజైన్ చేయబడింది. సందీప్ కిషన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. "యుద్ధం ఎంత పెద్దది అయినా సరే చుట్టూ నలుగురు స్నేహితులు తోడు ఉంటే చాలు గెలుపు నీదే మిత్రమా. నా ఇద్దరు స్నేహితులు స్వరూప్, రాహుల్ యాదవ్. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' లాంటి సినిమాలు పని చేసిన ఇన్క్రెడిబుల్లీ టాలెంటెడ్ ప్యాషనేట్ టీమ్‌తో నా తదుపరి చిత్రాన్ని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. మీకు క్రేజీ నోస్టాల్జిక్ వైబ్ ను అందిస్తానని వాగ్దానం చేస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేర్ చేసిన యాక్షన్ ప్యాక్‌డ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కలెక్షన్స్ గురించి ఆలోచించలేదు' 'వైబ్' ఫస్ట్ లుక్ పోస్టర్ లో సందీప్ కిషన్ వైల్డ్ యాక్షన్ అవతార్‌లో కనిపించారు. ఇందులో అతనితో పాటుగా అల్లర్లలో పాల్గొన్న ఫ్రెండ్స్ గ్యాంగ్ ను కూడా మనం చూడవచ్చు. సందీప్ ఒక చేతిలో రక్తంలో తడిసిన కత్తిని, మరో చేతిలో నిప్పులతో ఉన్న సోడా బాటిల్ ను పట్టుకొని ఇంటెన్స్ గా చూస్తూ నిలబడి ఉన్నాడు. ఒంటి నిండా గాయాలతో ఉన్న అతని స్నేహితులు కూడా, ఆయుధాలు పట్టుకుని ఎవరి మీదకో దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు.భారీ యాక్షన్‌తో పాటు, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో అందమైన ప్రేమకథతో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు.